సాక్షి
జనగామ

బుధవారం । 22 । నవంబర్ । 2023



కాటన్ మిల్లులో ఐటీ దాడులు

చిల్పూరు, రాఘనాథపల్లి మండలాల్లోని పలు మిల్లుల్లో ఐటీ అధికారులు దాడులు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు.

- 12లో▸



బీఆర్‌ఎస్, బీజేపీ.. బీసీ ద్రోహులు

తెలంగాణలో అధికార బీఆర్‌ఎస్, కేంద్రంలోని బీజేపీ బీసీ ద్రోహులుగా మిగిలిపోయాయని కర్ణాటక మాజీ రాజ్యసభ్యుడు హరిప్రసాద్ గౌడ్ విమర్శించారు. - 12లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30^0/21^0$

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉండి రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం



మరిపెడలో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి రెడ్యానాయక్

రెడ్యానాయక్ సీనియర్ నాయకుడు, నాకు మంచి సలహాదారు

- మళ్లీ గెలిపిస్తే మంచి హోదా కల్పిస్తా..
- గిరిజనుల కోరిక మేరకు తండాలను గ్రామ పంచాయతీలుగా చేశాం
- కాల్వలను చూసి కన్నీరు పెట్టుకున్న చోటే.. ధాన్యపురాశులు పండుతున్నాయి
- ఉద్యమ సమయంలో వీరన్నకు మొక్కి ముందుకెళ్లా..
- రాష్ట్రం సాధించాక స్వామికి కోరమీసం మొక్కు చెల్లించా
- డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

సాక్షి, మహబూబాబాద్/ మరిపెడ/ మరిపెడ రూరల్: 'యాడియే.. బాయియే.. బహెనో.. రాం..రాం' అందరూ బాగుండాలి. మంచి పాలన అందాలంటే తెలంగాణను పోరాడి సాధించుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి. బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యం' అని బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడలో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. ఏళ్లుగా గిరిజనులు తమ తండాలో తమ రాజ్యం కావాలని ఆకాంక్షించారని, గత పాలకులు పట్టించుకోలేదని, బీఆర్‌ఎస్ పాలనలో 3500 తండాలను పంచాయతీలుగా ప్రకటించామన్నారు. డోర్నకల్ నియోజకర్గంలోని 82 తండాల్లో గిరిజనులే పాలన సాగిస్తున్నారన్నారు. తన గురించి, పైరవీల గురించి ఆలోచించకుండా ప్రజల కోసమే పని చేసే రెడ్యానాయక్ వంటి నాయకుడు పాలించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. సీనియర్ నాయకుడిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. నాకు మంచి సలహాదారుడిగా ఉంటున్న రెడ్యానాయక్‌ను మళ్లీ గెలిపించాలని, నూతన ప్రభుత్వంలో మంచి హోదా కల్పించే బాధ్యత నాదని కేసీఆర్ ప్రకటించారు.

కురవి వీరభద్రుడు పవర్‌ఫుల్..

నియోజకవర్గంలోని కురవి వీరభద్రుడు పవర్‌ఫుల్ దేవుడు అని కేసీఆర్ అన్నారు. ఉద్యమ సమయంలో వీరన్నకు మొక్కి ముందుకెళ్లానని, తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత బంగారు కోరమీసం చెల్లించి మొక్కులు తీర్చుకున్నానని గుర్తుచేశారు. దేవుడే కాదు.. ఈ ప్రాంత ప్రజలు కూడా మంచి చైతన్యవంతులు అన్నారు. ఇదే చైతన్యంతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు.

కాల్వలతో ధాన్యం రాశులు

గత పాలకులు కాల్వలు తవ్వారు. కానీ ఏనాడూ చుక్కనీరు పారించలేదని కేసీఆర్ అన్నారు. వెన్నవరం కాల్వకు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ పట్టుపట్టి సాగునీరు వచ్చేలా కృషి చేశారని పేర్కొన్నారు. దీంతో నాడు నీళ్లు లేక కాల్వలను చూస్తే కన్నీరు వచ్చేదని, ఇప్పుడు నిండా పారుతున్న కాల్వలతో ధాన్యపురాశులు పండుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నిర్మించిన ప్రాజెక్టులతో రాష్ట్రంలో 3కోట్ల టన్నుల ధాన్యం పండుతుందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటే ధాన్యం ఉత్పత్తి 4కోట్ల టన్నులకు చేరుతుందని వివరించారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సీనియర్ నాయకులు నూకల నరేశ్‌రెడ్డి, రామసహాయం రంగారెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, డీఎస్ రవిచంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూర, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, వేణుగోపాల్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, అయూబ్ పాషా, చాపల యాదగిరిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన గులాబీల జెండలు పాట

ఏపూరి సోమన్న కళా బృందం సభ్యులు పాటలు పాడుతూ సభికులను ఉత్సాహపరిచారు. గులాబీల జెండల పాటకు స్టేజీపై ఉన్న మంత్రి సత్యవతి రాథోడ్, మానుకోట ఎంపీ మాలోతు కవిత, మహిళా ప్రజాప్రతినిధులు నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సభ ముగియడంతో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- **మధ్యాహ్నం 3:30 గంటలకు:** సభ ప్రాంగణానికి చేరుకున్న సీఎం హెలికాప్టర్.. వేదిక చుట్టూ ఒక రౌండ్ చక్కర్లు.
- **3:37 గంటలకు :** హెలికాప్టర్ ల్యాండింగ్
- **3:43 గంటలకు :** హెలిపాడ్ నుంచి బస్సులో వేదిక వద్దకు..
- **3:49 గంటలకు :** సీఎం ప్రసంగం ప్రారంభం
- **4:09 గంటలకు :** ప్రసంగం ముగింపు
- **4:16 గంటలకు :** హెలికాప్టర్‌లో సీఎం సూర్యాపేట వైపు పయనం..

మళ్లీ గెలిపిస్తే మరింత సేవ చేస్తా: రెడ్యానాయక్



ఇంతకాలం ప్రజల దీవెనలు, ఆశీస్సులతో డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, మళ్లీ గెలిపిస్తే మరింత సేవ చేస్తానని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మరిపెడలో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించుకున్నామని చెప్పారు. మళ్లీ మన ప్రభుత్వం రాగానే మరిపెడ రెవెన్యూ డివిజన్, డోర్నకల్‌లో 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించుకుందామన్నారు. మాకుల వేంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.5కోట్లు, నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

న్యూస్‌రీల్

ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం భక్తజన సందోహం నడుమ 108 బంగారు పుష్పాలతో చిల్పూరుగుట్టకు చెందిన వ్యాపార వేత్త జిల్లా రాజు–సుస్మిత దంపతులు అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామి వారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు, వసంత పాల్గొన్నారు.

విద్యా ప్రగతి పరిశీలన



జఫర్‌గఢ్: మండల కేంద్రమైన జఫర్‌గఢ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించేందుకు రాష్ట్ర విద్యాశాఖ బృందం కందాల రామయ్య చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు గౌస్‌పాషా మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన ఉన్నతి కార్యక్రమం అమలు తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి చదువులో రాణించేలా ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు పాటు పడాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావాలన్నారు. చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమనాథుడి స్మృతివనం సందర్శన



పాలకుర్తి టౌన్: పాలకుర్తి సోమేశ్వరస్వామి ఆలయం, స్మృతి వనాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బండారు ఉమా మహేశ్వరరావు బసవేశ్వరుని మామ బలదేవ మంత్రి వంశీకులు బండారు ఉమా మహేశ్వరరావు, డాక్టర్ రావు కుటుంబ సమేతంగా మంగళవారం సందర్శించారు. బమ్మెర, వల్మిడి నిర్మాణాలను తిలకించారు. తెలంగాణ ప్రభుత్వం మహాకవుల జన్మస్థలాలను అభివృద్ధి చేస్తున్నందుకు అభినందించారు. వారి వెంట సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, అర్చకులు డీవీఆర్‌శర్మ, ధర్మకర్త కోడూరు నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

త్వరితగతిన సీఎంఆర్ రవాణా పూర్తి చేయాలి



వరంగల్: వానాకాలం, యాసంగి 2022–23 సీఎంఆర్ రవాణాను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం సీఎంఆర్ రవాణాపై అధికారులతో వరంగల్ కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధి కమలాపురం, ఇల్లంద ధ్యానం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం 2023–24 ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలను ఓపీఎంఎస్‌లో చేయాలన్నారు. ఏనుమాములలోని గోదాంలను, ఎంఎల్‌ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. ఆయన వెంట వరంగల్, హనుమకొండ జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటింగ్ ప్రారంభం



ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు

జనగామ: పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, కోవిడ్, అత్యవసర సేవలు అందించే ఉద్యోగులకు సంబంధించి ఇంటింటి ఓటింగ్ కార్యక్రమంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. జిల్లాలో దివ్యాంగులు 15,930 మంది ఉండగా, 666 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధులు 14,275 ఉండగా, 810 మంది, అత్యవసర సేవలు (డాక్టర్లు, కరెంటు డిపార్ట్ మెంటు, పోలీసులు) 20 మంది పోస్టల్ ద్వారా ఇంటి వద్దనే ఓటు వేయనున్నారు. కాగా 12ఫారంలో ఉద్యోగులు 2,658 మంది పోస్టల్ ఓటు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఇంటింటికి ఓటు స్వీకరించే కార్యక్రమం కొనసాగుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు అన్ని కేటగిరీల్లో కలుపుకుని 188 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

జంగ్ తెలంగాణ

మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పాలకుర్తి టౌన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో రోజువారీగా తనిఖీలో భాగంగా పాలకుర్తి మండలం వావిలాలలో మంగళవారం రాత్రి బుద్ద ప్రణీత్ ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బి.సంతోష్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో 41 లీటర్ల మద్యం, 120 లీటర్ల బీర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ కె.పద్మ, ఆర్.మధు, సిబ్బంది ఎండీ సర్వర్, కర్ణాకర్, సుజాత, సంజీవరావు, మాదర్‌పాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శివలింగయ్య, అధికారులు

జనగామ రూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ రోజు అత్యవసర సర్వీస్‌లు నిర్వహించే ఓటరు తమ ఓటు హక్కును ముందుగా వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్ల కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటి నుంచి ఓటు సేకరణ వివరాలు ప్రతి రోజు మీడియా ద్వారా తెలియ జేయాలన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డు పంపిణీ చేయాలని, ప్రతి ఒక్కరికి స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీసీలో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్‌లు రోహిత్‌సింగ్, సుహాసిని, రిటర్నింగ్ అధికారులు మురళీకృష్ణ, రామ్మూర్తి, నోడల్ అధికారులు అనిల్‌కుమార్, వినోద్‌కుమార్, ఎస్‌బీసీ, రాంప్రసాద్, ఏఓ రవీందర్, దుర్గారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలు, చెక్ పోస్టు పరిశీలన

పెంబర్తిలోని కౌంటింగ్ కేంద్రాన్ని, పోలీస్ చెక్ పోస్టును జిల్లా ఉప ఎన్నికల అధికారి సుహాసిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు విధులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

వేగులతో సమాచార సేకరణ!

ప్రత్యర్థుల కదలికలు, ప్రచార సరళిపై ఆరా...

- ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్‌లో సమాచారం
- జంపింగ్ జపాంగ్‌లపై ఆరా.. అనుమానం వస్తే నిఘా
- ఉమ్మడి వరంగల్‌లో చాపకింది నీరులా పనిచేస్తున్న వైనం



సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల సమరానికి తెరపడేందుకు మరో ఎనిమిది రోజులే సమయం ఉంది. అంతకు రెండు రోజుల ముందే ప్రచారఘట్టం ముగియనుంది. ఈ నెల 30న పోలింగ్ జరగనుండగా అభ్యర్థుల గెలుపో.. ఓటమో డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు తర్వాత తేలనుంది. ఈ నేపథ్యంలో ఓ వైపు ప్రచారాన్ని హోరెత్తిస్తూనే.. మరోవైపు ప్రత్యర్థుల కదలికలను కనిపెట్టేందుకు అభ్యర్థులు 'వేగుల'ను నియమించుకున్నారు. ఒకరిని చూసి ఒకరు ఒక్కో నియోజకవర్గంలో సుమారు 150 నుంచి 200 మందిని నియమించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందడం కోసం అస్త్రశస్త్రాలను సంధిస్తున్న అభ్యర్థులు.. రోజూవారీగా రాత్రి 9 నుంచి 10.30 గంటల్లోపు వేగులు ఇచ్చే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని మరుసటి రోజు ఎదురుదాడికి సిద్ధమవుతున్నారు.

ప్రత్యర్థుల కదలికలు, ప్రచారసరళిపై దృష్టి..

పార్టీలో చురుకైన నాయకులు, కార్యకర్తలతోపాటు డిగ్రీ, పీజీ పూర్తయిన యువకులను వేగులుగా ఉపయోగించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించి టీఆర్‌ఎస్వీ, యూత్ విభాగం కార్యకర్తలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పరిస్థితిని అంచనా వేసి అభ్యర్థులకు చేరవేస్తున్నారు. పోటీ పార్టీల అభ్యర్థుల ప్రసంగాలకు సంబంధించిన వీడియోలు, జన సమీకరణ ఫొటోలు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తున్నారు. మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా అభ్యర్థుల ప్రచార సరళి,ప్రజల నుంచి వస్తు న్న స్పందనతోపాటు నిరసనలు, నిలదీతలను రిపోర్టు చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ సర్వే బృందాల పేరిట వివరాలు సేకరిస్తున్నారు.

కోవర్టులు, అసంతృప్తులపై ఆరా...

అభ్యర్థుల కోసం పనిచేస్తున్న వేగులు పార్టీలో కార్యకర్తలుగా ఉంటూనే కోవర్టులుగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించే పనిలోనూ ఉన్నారు. పార్టీలు మారే ఆలోచనలో ఉన్న వారిని సైతం గుర్తిస్తున్నారు. పొద్దంతా పార్టీ అభ్యర్థితో ఉంటూనే రాత్రివేళల్లో పోటీ అభ్యర్థులు, వారి అనుచరులతో 'సిట్టింగ్'వేసి గుట్టు విప్పుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇలా గుర్తించిన వారిని అభ్యర్థులు మందలించడంతో పార్టీలు మారిన వారు కూడా ఉన్నారు. ఇటీవల గ్రేటర్ వరంగల్‌లో ఓ కీలకనేత, ఇద్దరు కార్పొరేటర్లు పార్టీలు మారారు కూడా. అంతకు ముందు పరకాల, భూపాలపల్లి, డోర్నకల్, జనగామ నియోజకవర్గాల్లో కూడా పార్టీల పరిస్థితి ఉంది. అసంతృప్తితో రగిలిపోయే వారిని గుర్తించి జాబితాను కూడా తయారు చేసి అభ్యర్థులకు అందజేస్తుండగా... ఆ మరుసటి రోజే అసంతృప్తులను కలిసి బుజ్జగించి వెంట తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. వేగుల వ్యవస్థ.. ప్రభుత్వాలకు 'ఇంటెలిజెన్స్'ల ఉపయోగపడుతోందన్న చర్చ జరుగుతోంది.

మున్సిపల్‌లో 'ఏసీబీ' గుబులు

- లంచాలకు కేరాఫ్?
- ఇంటి అనుమతులపై ఆరా..!
- ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితులు
- పట్టణ ప్రణాళిక విభాగంలో ఓ అధికారిపై ఆరోపణలు



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

జనగామ: జనగామ మున్సిపల్‌లో ‘ఏసీబీ’ ట్రాప్ అధికారులు, సిబ్బందిని కలవరపాటుకు గురి చేసింది. మార్టిగేజ్ స్థలం రిలీజ్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన కమిషనర్ రజిత ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంగతి విధితమే. దీంతో పురపాలికలో ఇప్పుడు ఇదే చర్చ జరుగుతుంది. ఇందులో పని చేసే మరో అధికారి సైతం ఏసీబీ నిఘాలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుండడంతో.. ఎవరనే దానిపై గుసగుస లాడుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్‌లో కొంత మంది అధికారులు ఆడింది ఆట.. పాడింది పాటగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంటి అనుమతులు విషయంలో చిన్న చిన్న సాకులు చూపిస్తూ... అందిన కాడికి దోచేస్తున్నారనే ప్రచారం ఉంది. గతంలో ఇక్కడ పని చేసిన ఓ కమిషనర్ సైతం ఏసీబీ అధికారుల ఉచ్చు నుంచి తృటిలో తప్పించుకున్నా.. ఈ సారి లేడీ బాస్ పట్టుబడక తప్పలేదు. గత కొంత కాలంగా సెటిల్ మెంట్లకు అడ్డాగా మారిన పురపాలికలో... అక్రమాలకు కొదవ లేదు. నాసిరకం పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఇక్కడి అధికారులకు మరెవరూ సాటిరారు కావచ్చు.

టౌన్ ప్లానింగ్‌లో ఏం జరుగుతోంది?

ఇంటి అనుమతుల విషయంలో పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం టీఎస్ బీపాస్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురాగా, అధికారుల పాలిట కాసులు కురిపించే కల్పతరువుగా మారిపోయింది. భవన నిర్మాణ సమయంలో యజమానులు టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్న పదిహేను రోజుల లోపు అనుమతి లేదా నిరాకరణ ఇవ్వాలి. ఇక్కడి అధికారులకు మాత్రం అవేమీ పట్టడం లేదు. ఇంటి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకున్న వెంటనే.. కలెక్టరేట్‌లో సైట్ ఇన్‌స్పెక్టర్‌కు వెళుతుంది. సదరు దరఖాస్తుపై విచారణ చేసి కమిషనర్‌కు పంపిస్తాడు. ఆ అధికారి అన్నీ కరెక్టుగా ఉంటే అనుమతులు జారీ చేయాలే తప్ప, ఇందులో తలదూర్చడానికి అవకాశం లేదు. కానీ కలెక్టరేట్‌లో ఈ సేవలను ఆరు నెలల క్రితం రద్దు చేయడంతో.. ప్రస్తుతం మున్సిపల్‌లో పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారికే ఈ బాధ్యతలను అప్పగించారు. దరఖాస్తు దారుడి వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారి గోప్యంగా ఉంచాలి. రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులకు పట్టుబడిన కమిషనర్ విషయంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ సైట్ నుంచి చిట్టిపల్లి రాజు వివరాలు కమిషనర్‌కు ఎలా వెళ్లాయనే దానిపై విచారణ జ రపాల్సి ఉంది. అంటే ఇరువురి మధ్య పంపకాల భాగోతం ఉందనే ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతుంది.

అనుమతులెన్ని?

గత ఏడాది సెప్టెంబర్ మాసంలో ప్రస్తుతం ఏసీబీకి పట్టుబడిన కమిషనర్ రజిత ఇక్కడకు వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణం, తదితర అనుమతులు ఎన్ని ఇచ్చారనే దానిపై బయటకు రావాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో రిజక్ట్ చేసినవి ఎన్ని, తిరిగి అనుమతులు పొందిన సైట్‌ల వివరాలను లెక్క చూసి సరి చేస్తే... మామూళ్ల బాగోతం మొత్తం బయటకు వచ్చే చాన్స్ ఉంటుంది. ఒక్కో సైట్‌కు రూ.25వేల నుంచి రూ.4 లక్షల వరకు చేతులు మారినట్లు తెలుస్తుండగా.. ఇందులో ప్రముఖులు సైతం ఉండగా, కొంత మంది డైరెక్టుగా ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎంక్రోచ్ మెంట్ల పేరుతో జేసీబీల సహాయంతో కూల్చి వేస్తామంటూ హల్‌చేసి వదిలేసిన సైట్‌లో ఎంత లాగారనే దానిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగిదే హవా...

పట్టణ ప్రణాళిక విభాగంలో ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అధికారులు.. పలువురు లీడర్ల మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. టీఎస్ బీపాస్ దరఖాస్తులను వారికి చేరవేస్తూ... పొరపాట్లను సాకుగా చూపిస్తూ, బేర సారాలు నడిపిస్తున్నారని పట్టణంలో చర్చ జరుగుతుంది. ఎన్నికల నేపథ్యంలో గడిచిన మూడు నెలలుగా జిల్లా కలెక్టర్ సైతం ఇటువైపు కన్నెత్తి చూడక పోవడంతో.. ఇందులో పని చేసే చాలా మందికి కనీస భయం లేకుండా పోయింది.


పారా హుషార్...

నిత్యం మున్సిపల్ కార్యాలయం వద్ద కనిపించే ఒకరిద్దరు ఖద్దరు బాబులు.. ఇటు వైపు కన్నెత్తి సైతం చూడడం లేదు. ఏసీబీ ట్రాప్‌తో గప్‌చుప్ అయ్యారు. పురపాలికలో ఎవరి పనుల్లో వారు నిమగ్నం కాగా...రోజు వారి లాగా కాకుండా, అంతా సైలెంట్‌గా కనిపించింది. ఎవరిని మందలించినా.. నాకేం తెలియదనే సమాధానం తప్ప.. నోటిలో నుంచి రెండవ మాట వినబడలేదు.

కమిషనర్ భర్తను విచారణ చేయాలి


ఏసీబీ దాడిలో పట్టుబడిన కమిషనర్ భర్తను సైతం విచారణ చేయాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ బీపాస్‌లో ఇంటి నిర్మాణం కోసం అప్లికేషన్ చేసుకుంటే, కావాలనే రిజక్ట్ చేస్తూ, లంచాల పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కమిషనర్ భర్తను సైతం విచారణ జరిపితే మరిన్ని విషయాలు బయట పడుతాయన్నారు. కమిషనర్ చేతిలో నష్టపోయిన పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని అనారోగ్యంతో మృతి చెందిన కమ్మగాని శ్రీను కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ తెలిపారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న శిక్షకులు

జనగామ రూరల్: పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో రెండవ విడత శిక్షణలో భాగంగా మంగళవారం పీఓ, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్స్‌చే శిక్షణ ఇచ్చారు. పోలింగ్ స్టేషన్ ఏర్పాటులో ముందు రోజు 90 నిమిషాల ముందు ఈవీఎం, వీవీప్యాట్‌లతో మాక్ పోలింగ్ నిర్వహించడం, మాక్ పోల్ స్లిప్పులతో కంట్రోల్ యూనిట్‌తో ఫలితాలు సరిపోల్చడం, సీయూ నుంచి మాక్ పోల్ తొలగించడం తదితర విషయాలను తెలియజేశారు. క్యూలో నిలబడిన వారికి స్లిప్పులు ఇవ్వడం, ఓటు వేసిన తర్వాత సీయూలో క్లోజ్ బటన్ నొక్కడం, వీవీప్యాట్, పవర్ ప్యాట్‌ను తీసివేయడం వంటి విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, మాస్టర్స్ రామరాజు, డీఈఓ రాము, డీపీఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం


తొర్రూరు రూరల్: కంఠాయపాలెంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి


యశస్వినిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

- అవినీతి బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించాలి
- ఒక్కసారి అవకాశం వస్తే జీవితాంతం సేవ చేస్తా..
- కాంగ్రెస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తేనే పేదలకు తగిన న్యాయం జరుగుతుందని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి హనుమాండ్ల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని సోమారపుకుంట తండా, మడిపెల్లి, కంఠాయపాలెం, హచ్చుతండా, తొర్రూరు పట్టణంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు, తండాల గిరిజనులు బతుకమ్మలు, బోనాలు, కోలాటాలు, ఆటపాటలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు చేసేందుకు అమెరికా నుంచి వచ్చానని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని, రాత్రి, పగలూ తేడా లేకుండా అందుబాటులో ఉంటూ గ్రామాలు, తండాలను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీ నాయకులు ముత్తినేని సోమేశ్వర్‌రావు, కాకిరాల హరిప్రసాద్‌రావు, కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సుంచు సంతోష్, మేకల కుమార్, చాపట బాపురెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల భరోసాకు కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు

దేవరుప్పుల: తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ నేతృత్వంలో బతుకు భరోసాకు ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం కాంగ్రెస్‌కు పట్టంకట్టాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తొర్రూరులో మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ సోమనర్సమ్మ వెంకటయ్య, తెలుగుదేశం మండల అధ్యక్షుడు దామెర వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు గొడిశాల శ్రీను, బోనగిరి శ్రీను, పాలకుర్తి వెంకన్న, రెడ్డి రాజుల సత్తయ్య, కిష్టయ్య, యాకయ్య, కోలుకొం


తొర్రూరు: ప్రచారం నిర్వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, సీపీఐ నాయకులు

డకు చెందిన నందనబోయిన రామచంద్రు, కాంటిస్టేట్ ఎంపీటీసీ బానోతు రాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిక్కుడు చందర్, బోనగిరి శివ, భిక్షపతి, గిరిశెట్టి రమేష్, మాచర్ల ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, నల్ల సత్యనారాయణ, రచ్చ కృష్ణమూర్తి, పెద్దులు, దామెర అనిల్, రెడ్డిరాజుల రమేష్, బోనగిరి యాకస్వామి ఉప్పుల ప్రకాష్, లొడంగి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ చెలగాటం

నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఓయూ జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి ఆరోపించారు. మంగళవారం రామరాజుపల్లిలో కాంగ్రెస్ నాయకుడు ఉప్పునూతల పురుషోత్తం, బీసీ సెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్ ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకు కాంగ్రెస్ ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతల రవీందర్, కృష్ణ, యాదగిరి, మాజీ సర్పంచ్ కొలెం మల్లయ్య, నర్సయ్య, లింగయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం రాబోతుంది

ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలిశర్మ

తొర్రూరు: తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం రాబోతుందని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలిశర్మ అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డిలతో కలిసి డాలిశర్మ మాట్లాడారు. ప్రజల కష్టాలు అర్థం చేసుకున్నాం.. కాబట్టే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలోని అన్ని స్కాముల్లో కేసీఆర్ ఫ్యామిలీ ఉందన్నారు. యువత బలిదానాలతో పోరాడి సాధించుకున్న తెలంగాణలో నియంత పాలన సాగుతుందన్నారు. అధికారం కోసం బీఆర్ఎస్ ఎంతకైన తెగి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలిశర్మ, పక్కన యశస్వినిరెడ్డి

స్తుందన్నారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో మాట నిలబెట్టుకున్నట్లే, ఇప్పుడు కాంగ్రెస్ హామీనిచ్చిన 6 గ్యారెంటీ పథకాలను నిలబెట్టుకుంటుందన్నారు. పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ గాలి వీస్తుందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. మంత్రి ఎర్రబెల్లికి ఓటమి రుచి చూపుతామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్లమెంట్ అబ్జర్వర్ రవీంద్ర దాల్వి, మహారాష్ట్ర ఎమ్మెల్సీ రాజేష్ రాథోడ్, నాయకులు శోభారాణి, అనిల్‌కుమార్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, హరిప్రసాద్, ప్రవీణ్‌రావు, సోమయ్య, ఎర్రబెల్లి రాఘవరావు, సుంచు సంతోష్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలపర్చాలి

కార్మికులు కాంగ్రెస్‌ను బలపర్చాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపు కోరుతూ మంగళవారం పట్టణంలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు ప్రచారం చేపట్టారు. హమాలీ కార్మికులను కలిసి మద్దతు కోరారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కౌన్సిలర్ తూనం రోజా, నాయకులు ఓమ భిక్షపతి, బందు మహేందర్, మల్లయ్యలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రజక సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల సమ్మయ్య, వడ్డెర సంఘం నాయకులు మాజీ వార్డు సభ్యులు బొమ్మిశెట్టి ఎల్లేష్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే భవిష్యత్ ఆగమే..


కొడకండ్ల: బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు


కొడకండ్ల: మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి
- బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జంగ్ తెలంగాణ

కొడకండ్ల: అభివృద్ధిని ఆస్వాదించి మరోసారి గెలిపిస్తే పాలకుర్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే భవిష్యత్ ఆగమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని రేగుల, రేగులతండా, ఏడునూతుల, నర్సింగాపురం, రంగాపురం, గుమ్ముల బండతండా, పాకాల, రామవరం, రామేశ్వరం, మొండ్రాయిలో మంత్రి దయాకర్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించగా బైక్ ర్యాలీలు, మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ పాలనకు ముందు గిరిజనతండాలు, గ్రామాలు ఎలా ఉండే.. కేసీఆర్ పాలనలో ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలు గమనించి ఓటు వేయాలని, ఎన్నికల సమయంలో వలస పక్షులు వస్తాయని, వారి మాటలను నమ్మొద్దన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. కరోనా కష్టకాలంలో అండగా నిల్చి ఆక్సిజన్ సిలిండర్లు, మందులు పంపిణీ చేశానని, యువత ఉపాధి కోసం మెగా జాబ్ మేళాలను నిర్వహించామని, దేశంలో ఎక్కడ అమలు చేయని సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి ఎన్నో వినూత్న సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కొందరు నాయకులు కాంగ్రెస్ వాళ్ల వద్ద డబ్బులు తీసుకొని బ్రోకర్ మాటలు చెప్తుంటారని, ఎవరు ఎలాంటి వారో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి 100 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జోరు పెంచిన బీఆర్ఎస్

తొర్రూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని


దేవరుప్పుల: సీత్యతండాలో మాట్లాడుతున్న ఉషాదయాకర్‌రావు

అన్ని గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. పోలింగ్‌కు మరో వారం రోజులు మాత్రమే ఉండడంతో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రతి గ్రామం, తండాల్లో బీఆర్ఎస్ పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, రైతులతో కలిసి ఇంటింటికి వెళ్లి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు హామీలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, యువత, కార్యకర్తలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన గౌడ కులం పెద్దమనిషి గిరగాని జనార్దన్, సొసైటీ అధ్యక్షుడు గిరగాని అయిలయ్యలు తమ వారితో కలిసి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం మంత్రి దయాకర్‌రావు వారికి పార్టీ శాలువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు పోశాలు వెంకన్న, గర్వందుల మల్లేష్‌లు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండలం నుంచి బుడిగ జంగాల సంఘం సభ్యులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి దయాకర్‌రావు పార్టీ శాలువాలు కప్పి ఆహ్వానించారు. కాగా బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకే మా మద్దతు ఉంటుందని రాష్ట్ర మాల సంఘాల నాయకులు నల్లాల కనకరాజు, తాళ్లపల్లి రవి, గుడిపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. అలాగే మండల కేంద్రా


పాలకుర్తి: పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దయాకర్‌రావు

నికి చెందిన యువ చైతన్య సభ్యులు కత్తుల అశోక్, గుట్టకింది తండా, దర్దేపల్లికి చెందిన కొంతమంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అభివృద్ధికి పట్టం గట్టండి

దేవరుప్పుల: సీఎం కేసీఆర్ సారథ్యంలో దయన్న చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలును చూసి మరోసారి బీఆర్ఎస్‌కు పట్టంగట్టాలని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మాధాపురం, కడవెండి, ధర్మాపురం రెవెన్యూ పరిధి గిరిజన తండాల్లో పాలకుర్తి ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి దయాకర్‌రావు గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, సర్పంచ్‌లు సునీత, రమాదేవి, ఎంపీటీసీ ఆశాజ్యోతి, రైతుబంధు కోఆర్డినేటర్ కోతి పద్మ, మహిళ నాయకురాళ్లు నల్ల ఉమ, భూక్య అరుణ, కరుణ, లలిత, రజిత, సునిత, మాధవి, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి

పెద్దవంగర: బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దయాకర్‌రావు గెలిస్తేనే మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోరుతూ మండలంలోని గంట్లకుంట, కాన్వాయగూడెం గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీతో టీఎస్ బీపాస్ నిధులు స్వాహా

- ఇస్లావత్ తండా(ఎం) జీపీలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామపంచాయతీ సర్పంచ్ ఇస్లావత్ నరేశ్ తన సంతకాన్ని ఫోర్జరీ చేసి సంయుక్త బ్యాంకు ఖాతా నుంచి టీఎస్ బీపాస్ నిధులు రూ.49 వేలు స్వాహా చేశారని ఉప సర్పంచ్ ఇస్లావత్ రంగమ్మ అన్నారు. తమ ఇద్దరి పేరు మీద సంయుక్తంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మానుకోట బ్రాంచ్‌లో టీఎస్ బీపాస్ అకౌంట్ ఓపెన్ చేశామన్నారు. అయితే సదరు ఖాతా నుంచి సర్పంచ్ నరేష్ ఈ నెల 16వ తేదీన జీపీ కార్యదర్శికి కూడా తెలియకుండా టీఎస్ బీపాస్ నిధులు రూ.49 వేలు డ్రా చేశారన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ ప్రమేయం లేకుండా, సంతకం లేకుండా డబ్బులు డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై ఎంపీడీఓ, ఎంపీఓ, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హసన్‌పర్తి: నగరంలోని గోపాల్‌పూర్‌లో పేకాట కేంద్రంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఇందులో దేవన్నపేటకు చెందిన వేమన్నరెడ్డి, మహేందర్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి, గోపాల్‌పూర్‌కు చెందిన సుమన్, ఉమాశంకర్‌రెడ్డి, రాంచందర్‌ను అరెస్టు చేసి రూ.45,520 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌తెలిపారు.

మత్స్యరంగానికి ఉజ్వల భవిష్యత్

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజన్న

కరీమాబాద్: మత్స్యరంగానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజన్న అన్నారు. మామునూరు కేవీకేలో మంగళవారం ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు చేపల పెంపకం కూడా చేపట్టొచ్చని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ ఆక్వా ఎగుమతులు, ఆక్వా రంగంలో సవాళ్ల గురించి వివరించారు. తెలంగాణలో చేపల పెంపకం ప్రాముఖ్యం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఉద్దేశం, నిర్దేశిత లక్ష్యం గురించి తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త గణేశ్ ఓవర్ ఫిషింగ్, ఆశ్రయాల క్షీణత, అక్రమ పద్ధతిలో చేపలు పట్టడం, పర్యావరణ కాలుష్యం మూలంగా కలిగే నష్టాల గురించి వివరించారు. కాగా, ధర్మసాగర్ మండలం మలక్‌పల్లికి చెందిన రైతు కుమారస్వామి జెల్ల చేపలు పెంచగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, సౌమ్య, గణేశ్, రాజు, శశాంక్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.


రైతు కుమారస్వామిని సన్మానిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రైతుల వివరాలు నమోదు చేయాలి

కమలాపూర్: కొనుగోలు కేంద్రాల్లో రోజూ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఆదేశించారు. కమలాపూర్‌లో ఐకేపీ, గూడూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించి కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ వసంతలక్ష్మి, డీఎం మహేందర్, డీపీఎం ప్రకాశ్, డీటీ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సీఈఓ చోటేమియా, ఐకేపీ సీసీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.


గూడూరులో కొనుగోళ్ల ప్రక్రియ తెలుసుకుంటున్న అనిల్‌కుమార్

'తెలంగాణ ఉద్యమ రత్న' పురస్కారానికి హరీశ్‌రావు ఎంపిక

కమలాపూర్: 'తెలంగాణ ఉద్యమ రత్న 2023–24' పురస్కారానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఎంపిక చేసినట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకులకు పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమ రత్న అవార్డు ఇవ్వాలని సంకల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉద్యమ నాయకుడు, మంత్రి హరీశ్‌రావును ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించే ఎస్ఆర్ఎఫ్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావుకు పురస్కారం అందజేస్తామని అమరేష్ తెలిపారు.


మంత్రి హరీశ్‌రావుకు ఎంపిక పత్రం అందజేస్తున్న అమరేష్

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు మేలు

మహబూబాబాద్ రూరల్: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి లాభాలు పొందాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు ఆర్.ఉమా రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ సంచాలకులు ఐ.స్వర్ణలత అన్నారు. జాతీయ ఆహారభద్రత పథకం వారి ఆర్థిక సౌజన్యంతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేలికపాటి (తక్కువ సారవంతమైన) భూముల్లో పత్తిని సాగు చేసే రైతులందరూ అధిక సాంద్రత పద్ధతిని పాటించి లాభాలు గడించాలని సూచించారు. ఈ ప్రాజెక్టుపై మానుకోట జిల్లాలో 208 ఎకరాల్లో క్షేత్ర ప్రదర్శనలు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఈ సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. పత్తి ప్రధాన శాస్త్రవేత్త జి.వీరన్న మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే నవంబర్ చివరికల్లా పంటను తొలగించి రెండో పంట వేసుకోవచ్చన్నారు. దీంతో గులాబీ రంగు పురుగు ఉధృతిని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ, వరంగల్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.వెంకన్న, జి.పద్మజ, బి.మాధవి, జేవీఆర్ హెచ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.భాస్కర్, ప్రశాంత్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిశోర్ కుమార్, డాక్టర్ ఇ.రాంబాబు, బి.క్రాంతికుమార్, డి.ఉషశ్రీ, కాటన్ ప్రాజెక్ట్ వైపీలు, కేవీకే సిబ్బంది, 620 మంది రైతులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన 18 స్టాళ్లను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.


స్టాళ్లను సందర్శిస్తున్న ఉమారెడ్డి, స్వర్ణలత, కేవీకే, వ్యవసాయ అధికారులు